
వేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా రథసప్తమి వేడుకలు

- జిల్లాలోని ఆలయాల్లో సప్త వాహనాలపై స్వామివార్ల ఊరేగింపు

చేవెళ్ల/కడ్తాల్, ఫిబ్రవరి 16: జిల్లాలో రథ సప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఉదయం నుంచి రాత్రి వరకూ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని సూర్య ప్రభ వాహనసేవ, హంసవాహన సేవ, సింహవాహన సేవ, శేష వాహనంపై ఊరేగారు. గోవింద నామస్మరణతో దేవాలయప్రాంతం మార్మోగింది. కడ్తాల మండలం మక్తమాధారం శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో రథ సప్తమి సందర్భంగా స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, ఎంపీటీసీ మంజుల చంద్రమౌళి, మాజీ సర్పంచ్ సులోచన సాయిలు, బిచ్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్లలో ధర్నా చేస్తున్న నాయకులు

కార్పొరేట్ శక్తులకు కేంద్రం ఊడిగం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి16): కేంద్రంలోని బీజేపీ కార్పొరేట్-మతతత్వ విధానాలను వ్యతిరేకిస్తూ కార్మిక, రైతు, ప్రజాస్వామ్య హక్కుల సాధనకు శుక్రవారం నిర్వహించిన దేశ వ్యాప్త కార్మికుల సమ్మె, గ్రామీణ భారత్‌బంద్ జిల్లాలో విజయవంతమైంది. జిల్లాలోని మండల కేంద్రాలు, గ్రామాల్లో వివిధ వ్యవసాయ, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించారు. పలు చోట్ల ర్యాలీలు నిర్వహించడంతో పాటు మానవహారాలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందన్నారు. ఈ నియంత పాలనను అంతమొందించి వచ్చేపార్లమెంటు ఎన్నికల్లో మోదీ పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. ప్రజావ్యతిరేక విధానాలను బీజేపీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ ధర్నాల్లో రైతులు, కార్మికులు, వివిధ ఉద్యోగ సంఘాల నేతలు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, ఆశావర్కర్లు, హెల్త్ విభాగం ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గళం విప్పిన ఎమ్మెల్యేలు

- కేఎల్ఐ డీ-82 కాల్వ పనులు పూర్తి చేయాలి
- పరిహారానికి రూ.40 కోట్లు విడుదల చేయాలి
- అసెంబ్లీలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- కులగణను స్వాగతిస్తున్నాం : ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


ఎమ్మెల్యే నారాయణరెడ్డి


ఆమనగల్లు, ఫిబ్రవరి 16: కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డీ-82 కాల్వ అసంపూర్తి పనులను పూర్తి చేయించి నిర్దిత ఆయకట్టుకు సాగునీరందించాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. కాల్వ నిర్మాణానికి కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేసినా అసంపూర్తి పనుల మూలంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరకుండా పోతోందన్నారు. శుక్రవారం బడ్జెట్ సమావేశాల్లో కల్వకుర్తి నియోజకవర్గంలో పలు సమస్యల గురించి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రస్తావించారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండ, ఆమనగల్లు, మాడ్గుల మండలాల పరిధిలో 35వేల ఎకరాలకు సాగు నీరందించేందుకు రూ.178 కోట్లు కాల్వ నిర్మాణానికి కేటాయించగా రూ.160కోట్లు ఖర్చు చేయడం జరిగిందన్నారు. వెల్దండ మండలం చెర్కూర్ వద్ద ఓ రైతు పొలానికి రూ.5లక్షలు పరిహారం అందించకపోవడంతో 2018లో పనులు నిలిపివేశారని ఎమ్మెల్యే సభ దృష్టికి తెచ్చారు. కేఎల్ఐ డీ-82 కాల్వ అసంపూర్తి పనులు త్వరితగతిన పూర్తి చేసి రైతుల ప్రయోజనాలు కాపాడాలని కోరారు. అదేవిధంగా కాల్వ నిర్మాణానికి భూములు కోల్పోయిన రైతులకు అందించాల్సిన రూ.40 కోట్లు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిని గత ప్రభుత్వం 30 పడకల నుంచి పది పడకలకు కుదించిందని దీంతో రోగులకు వైద్య సేవలు పూర్తి స్థాయిలో అందక ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ భూవివాదం కారణంగా అసంపూర్తిగా నిలిచిపోయిందని, దానిని పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే నారాయణరెడ్డి ప్రస్తావించిన సమస్యలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకుపోయి వీలైనంత త్వరగా పరిష్కారం అయ్యేలా చూస్తానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమాధానం ఇచ్చారు.

కీలక అంశాల్లో షాద్‌నగర్‌ను నిర్వీర్యం చేశారు


ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్


షాద్‌నగర్ : కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కుల గణన కోసం తీర్మానం చేయడాన్ని స్వాగతిస్తున్నామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శుక్రవారం శాసనసభలో తెలిపారు. ప్రభుత్వాలు బీసీలను ప్రచారాలకు వాడుకున్నాయే తప్పా, రాజకీయంగా ఎదుగుదలకు ఎలాంటి ప్రయత్నాలు చేయలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ నిర్ణయం తీసుకోవడం పట్ల వెనుకబడిన కులాలు అభినందిస్తున్నాయన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎన్నో ప్రగల్భాలు పలికిందని, కానీ అవి ఏవీ కూడా ఆచరణకు నోచుకోలేదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శాసనసభ దృష్టికి తెచ్చారు. ఎత్తిపోతల పథకం 80 శాతం పూర్తయిందని గత ప్రభుత్వం వెల్లడించిందని, మరి ఎందుకు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం కోసం చర్యలు తీసుకోలేదో తెలపాలన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలో చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీలో ఎలాంటి శాస్త్రీయతా లేకుండా ఇష్టానుసారంగా ఇళ్లను పంపిణీ చేశారని సభ దృష్టికి తెచ్చారు. అసెంబ్లీ ఎన్నికల ముందు హడావుడి చేసి లబ్ధిదారులను గుర్తించి కొందరికి మాత్రమే ఇళ్లను పంపిణీ చేశారని పేర్కొన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ బాధ్యతను జిల్లా కలెక్టర్‌కు గాని, లేదా సంబంధిత శాఖ అధికారులకు అప్పచెప్పాలని కోరారు. అలాగే నియోజకవర్గంలో విద్య పూర్తిగా కుంటుపడిందని, విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేయాలని తెలిపారు.

జీవో 111పై అపోహలు తొలగించాలి


ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల : జీవో 111 పరిధిలోకి వచ్చే చేవెళ్ల నియోజకవర్గంలోని గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆ జీవో 111 రద్దు అయ్యిందా లేక ఏవిధమైన చర్యలు తీసుకుంటారని, దీనిపై ప్రజల్లో అపోహలు తొలగించాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. అసెంబ్లీలో శుక్రవారం పలు అంశాలపై మాట్లాడారు. ఈ జీవో మూలంగా రైతులు తమ పిల్లల పెళ్లిళ్లకు భూమి అమ్ముకుందామన్నా ఇబ్బంది పడాల్సి వస్తోందన్నారు. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. అలాగే గతంలో సీఎం కేసీఆర్ ఏ పార్టీ అని చూడకుండా అన్ని వర్కులు ఇచ్చి అందరు గౌరవించేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఎక్కడ లేని విధంగా ఓడిపోయిన ఎమ్మెల్యే అభ్యర్థులే పనులు ఇస్తారని చెప్పడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. దీనిపై రాష్ట్ర ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించి ఎమ్మెల్యే యాదయ్య చెప్పిన అంశాలను నోట్ చేసుకున్నామని, సంబంధిత శాఖలకు రిపోర్టు చేస్తామని వివరించారు.

- కాంగ్రెస్‌లో చేరిన వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి, ఆమె కుమారుడు రినీష్‌రెడ్డి
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి తరలివచ్చిన నేతలు, కార్యకర్తలు
- హస్తం గూటికి అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్‌రెడ్డి
- చేరికలతో సందడిగా మారిన గాంధీ భవన్
- మహేందర్‌రెడ్డి ఇంటి వద్ద కోలాహలం


దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న సునీతారెడ్డి

గులాబీలో చీలికలు.. హస్తంలో చేరికలు!

పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో గులాబీ పార్టీలో చీలికలు.. హస్తం పార్టీలో చేరికలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారం కోల్పోయిన తర్వాత ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు, కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు. ఆ దిశగానే పలువురు నేతలు సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి పెద్ద సంఖ్యలో ప్రజా ప్రతినిధులతో సహా పలువురు నాయకులు హస్తం గూటికి చేరుతున్నారు. తాజాగా మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి సతీమణి, వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం గాంధీ భవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. సునీతారెడ్డితో పాటు ఆమె కుమారుడు రినీష్‌రెడ్డి, టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ మామ కంజర్ల చంద్రశేఖర్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

వివరాలు 7లో..

హైవేపై సడన్ బ్రేక్..

- ఒకదాన్ని మరొకటి ఢీకొన్న ఐదు కార్లు
- తప్పిన పెను ప్రమాదం
- చేవెళ్లలోని ముడిమ్యాల్ స్టేజీ వద్ద హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై ఘటన

చేవెళ్ల, ఫిబ్రవరి 16 : అతివేగం, అజాగ్రత్తగా వాహనం నడుపుతూ ఓకారు డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనకాల వస్తున్న ఐదు కార్లు వరుసగా ఒకదాన్ని మరొకటి బలంగా ఢీకొన్నాయి. ఈ ఘటన శుక్రవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల పరిధిలోని ముడిమ్యాల్ స్టేజీ వద్ద హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మీదుగా హైదరాబాద్ వెళ్తున్న ఓ కారు డ్రైవర్ శుక్రవారం సాయంత్రం ముడిమ్యాల్ స్టేజీ వద్దకు రాగానే ఒక్కసారిగా సడెన్ బ్రేక్ వేశాడు. దాంతో వెనకాల వస్తున్న ఐదు కార్లు వాటి ముందు వెళ్తున్న కార్లను ఒక దాన్ని మరొకటి బలంగా ఢీకొన్నాయి. దీంతో ఐదు కార్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. ప్రాణనష్టం జరగకపోవడంతో వాహనదారులందరూ ఊపిరి పీల్చుకున్నారు. కాగా, హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి వెడల్పు తక్కువగా ఉండటంతో వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం తక్షణమే రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని వాహనదారులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.


చేవెళ్ల మండల పరిధి ముడిమ్యాల్ స్టేజీ వద్ద ఒకదానికి ఒకటి ఢీకొన్న కార్లు


యాచారం బస్టాండ్‌లో వసతులపై ఆరా తీస్తున్న ఆర్టీసీ అధికారులు

బస్టాండ్‌లో వసతుల కల్పనకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యాచారం, ఫిబ్రవరి16 : యాచారం ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఈనెల 5న సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'యాచారం బస్టాండ్‌లో వసతులు కరువు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఎంపీపీ కొప్పు సుకన్యబాషా, ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ బి.వెంకటనర్సప్ప స్పందించారు. ఈ మేరకు వారు శుక్రవారం బస్టాండ్‌ను సందర్శించి ప్రయాణికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. బస్టాండ్ ఆవరణంతాపరిశీలించారు. బస్టాండ్ ఆవరణతో తాగు నీటి వసతికి పైప్‌లైన్ నుంచి కనెక్షన్ ఇవ్వాలని ఎంపీపీ మిషన్‌భగీరథ ఎ.ఈ పాషాను ఆదేశించారు. పంచాయతీ కార్మికులతో ప్రతిరోజు ట్యాంకులు శుభ్రం చేయించాలని కార్యదర్శి తిరుపతిని ఆదేశించారు. విద్యుత్ వసతి కల్పించడానికి చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ సందీప్‌కు సూచించారు. పంచాయతీ నిధులతో లేదా కలెక్టర్‌తో మాట్లాడి బస్టాండ్ ఆవరణలో సీసీ రోడ్డు వేయించడానికి చర్యలు తీసుకుంటామని ఎంపీపీ, ఎంపీడీవో నరేందర్‌రెడ్డి చెప్పారు. ఆర్టీసీ సంస్థ నెలకు రూ.3వేలు ఇస్తుందని ఆ నిధులతో ప్రతిరోజు బస్టాండ్ ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని డీఎం వెల్లడించారు. కాగా బస్టాండ్‌లో తాము పడుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తేవడం పట్ల పలువురు ప్రయాణికులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో ఉమారాణి, బీజేపీ రాష్ట్ర దళిత మోర్చా అధ్యక్షులు కొప్పుబాష, తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- మర్రిపల్లి, ముద్విన్ నుంచి నిర్భయంగా తరలింపు
- అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదంటున్న స్థానికులు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు


ముద్వేల్‌లో ఫిల్టర్ ఇసుక తయారీ

కడ్తాల్, ఫిబ్రవరి 16: మండల పరిధిలోని ముద్విన్, మర్రిపల్లి గ్రామాల నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని మండల సమావేశాలలో పలువురు ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తెచ్చినా, రైతులు, గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు అధికారుల అండదండలతోనే ఇసుక అక్రమ రవాణా, కృత్రిమ ఇసుక తయారీ దందా జోరుగా సాగుతుందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా మూలంగా భూగర్భ జలాలు అడుగంటి బోర్లలో నీటిమట్టం పడిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల నుంచి నిత్యం పగలు, రాత్రి తేడా లేకుండా ఇసుక అక్రమ రవాణా సాగుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. అప్పుడప్పుడు పోలీసు, రెవెన్యూ అధికారులు ఫిల్టర్లపై దాడులు చేసి కేసులు నమోదు చేసినా ఇసుక వ్యాపారుల తీరు మారడం లేదు. నిత్యం ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా పెద్ద ఎత్తున ఇసుకను ఆమనగల్లు, కడ్తాల మండలాలకు అక్రమంగా రవాణా చేస్తూ ఇసుక మాఫియా రూ.లక్షలు గడిస్తోంది. తమ ఆగడాలను అడ్డుకుంటున్న వారిపై దాడులకు సైతం తెగబడుతున్నారన్న ఆరోపణలున్నాయి. అదేవిధంగా మర్రిపల్లి, ముద్విన్ గ్రామాల సమీపంలోని వాగులు, పంట పొలాల నుంచి మట్టిని తవ్వి ఫిల్టర్ల ద్వారా కృత్రిమ ఇసుక తయారు చేసి విక్రయిస్తున్నారు. అక్రమ తవ్వకాల వల్ల కాల్వలు, వాగులు వ్యవసాయ పొలాలు దెబ్బతింటున్నాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుకను రూ.5వేల వరకు విక్రయస్తున్నట్లు సమాచారం. కొందరు అధికారులకు అక్రమ ఇసుక రవాణా గురించి కొందరు సమాచారం ఇచ్చినా మీకేందుకంటూ బెదిరిస్తున్నట్లు తెలిసింది. ఇసుక అక్రమ రవాణా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశిస్తుంటే కడ్తాల మండలంలో మాత్రం అందుకు విరుద్ధంగా ఇసుక రవాణా యథేచ్ఛగా సాగడం అనుమానాలకు, అపోహలకు తావిస్తోంది. ఇసుక అక్రమ రవాణా గురించి ఎస్ఓటీ పోలీసులకు తెలిసినా, నిఘా విభాగాలకు సమాచారం ఉన్నా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. స్థానిక అధికారులు ఇసుక అక్రమ రవాణా గురించి పట్టించుకోకపోవడంతో వివిధ గ్రామాలకు చెందిన కొందరు యువకులు సోమవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌కు వెళ్లి ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.


మర్రిపల్లిలో ఇసుక నిల్వలు



కఠిన చర్యలు తప్పవు

ఎవరైనా కృత్రిమ ఇసుక తయారు చేసినా, అనుమతులు లేకుండా రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవు. ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటల నుంచి మట్టి తరలించడం నేరం. ఇసుక అక్రమ రవాణా జరుగకుండా నిఘా ఏర్పాటు చేశాం. గతంలో ఫిర్యాదులు రావడంతో రెవెన్యూ, పోలీసు శాఖ ఆధ్వర్యంలో అనేకసార్లు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేశాం. ఇసుక అక్రమ రవాణాకు వినియోగించిన వాహనాలను సీజ్ చేశాం.

\- ముంతాజ్, తహసీల్దార్, కడ్తాల్

కులగణనతో అన్ని వర్గాలకు సమన్యాయం


ర్యాలీ నిర్వహిస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ తదితరులు

మేడ్చల్ ఫిబ్రవరి 16(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కులగణనతో తెలంగాణలో అన్ని వర్గాలకు సమ న్యాయం జరుగుతుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ తెలిపారు. కులగణన తీర్మానానికి మద్దతుగా శుక్రవారం సాయంత్రం ఆయన సీఎం రేవంత్‌రెడ్డి, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను కలిశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ తెలంగాణలో అన్నివర్గాల ప్రజలకు కులగణనతో సమ న్యాయం జరుగుతుందన్నారు. కులగణన నిర్ణయం చరిత్రాత్మకమైన నిర్ణయమన్నారు. ఎన్నికల సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు శుక్రవారం తెలంగాణ శాసనసభలో కులగణనపై తీర్మానం ప్రవేశపెట్టడం వల్ల ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై మరింత నమ్మకం పెరిగిందన్నారు. కులగణనతో ప్రధానంగా బీసీ వర్గాలకు సముచిత న్యాయం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చెప్పిందే చేస్తుందని చెప్పడానికి కుల గణనే సాక్ష్యమన్నారు.

డీఎస్పీల బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన వికారాబాద్ డీఎస్పీ అంజయ్య

వికారాబాద్, ఫిబ్రవరి 16: వికారాబాద్ డీఎస్పీగా సి. అంజయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు వికారాబాద్ డీఎస్పీగా ఉన్న నర్సింహులు బదిలీ కావడంతో కొత్తగా అంజయ్య డీఎస్పీగా ఇక్కడికి బదిలీపై వచ్చారు.

తాండూరు డీఎస్పీగా బాలకృష్ణారెడ్డి


బాధ్యతలు స్వీకరిస్తున్న డీఎస్పీ బాలకృష్ణారెడ్డి

తాండూరు: తాండూరు డీఎస్పీగా బాలకృష్ణారెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. హైదరాబాద్‌లో మెట్రోరైల్ డీఎస్పీగా పనిచేస్తున్న బాలకృష్ణారెడ్డి బదిలీపై తాండూరు వచ్చారు. ఇక్కడ డీఎస్పీగా పనిచేస్తున్న శేఖర్‌గౌడ్‌ను డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేశారు.

మేడారం జాతరకు తాండూరు బస్సులు

తాండూరు, ఫిబ్రవరి 16: మేడారం జాతరకు తాండూరు నుంచి 46బస్సులను పంపిస్తున్నట్లు డిపో మేనేజర్ సమత తెలిపారు. ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు డిపోలో ఉన్న మిగతా 47 బస్సులతో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తామన్నారు. వారం రోజుల పాటు సగం బస్సులను మాత్రమే నడుపనుండడంతో ప్రయాణికులకు కొంత అసౌకర్యం ఏర్పడే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈనెల 26వ తేదీ నుంచి పూర్తిస్థాయిలో బస్సులు నడుస్తాయన్నారు.

ఎన్‌సీసీలో చేరి దేశానికి సేవచేయాలి


ఎన్‌సీసీ పరేడ్‌లో పాల్గొన్న అనురాగ్ యూనివర్సిటీ ఎన్‌సీసీ అభ్యర్థులు, ఎన్‌సీసీ అధికారులు

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 16: విద్యార్థులు ఎన్‌సీసీలో చేరి దేశానికి సేవచేయాలని ఎన్‌సీసీ గ్రూప్‌కెప్టెన్ వర్షాగోఖలే అన్నారు. మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ ఎన్‌సీసీ అభ్యర్థుల మూడు సంవత్సరాల శిక్షణకాలం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎన్‌సీసీ అభ్యర్థులకు ఆమె ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు సంవత్సరాల పాటు కఠోరశిక్షణ పూర్తి చేసిన ఎన్‌సీసీ అభ్యర్థులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో వింగ్ కమాండర్ డీఎస్ఎన్ మూర్తి, సీటీవో డాక్టర్ మల్లేష్ పాల్గొన్నారు.

అవిశ్వాస తీర్మానం వాయిదా

దోమ, ఫిబ్రవరి 16: మండలంలోని మోత్కూర్ పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం శుక్రవారం వాయిదా పడినట్లు సీఈవో యాదగిరి తెలిపారు. సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం శుక్రవారం నిర్వహించాలని ప్రతిపాదనలు సిద్ధం చేయగా ఉన్నతాధికారులు రాకపోవడంతో వాయిదా పడినట్లు తెలిపారు. మొత్తం 13 మంది డైరెక్టర్లు ఉండగా అవిశ్వాసం నెగ్గాలంటే తొమ్మిది మంది డైరెక్టర్లు మద్దతు తెలపాల్సి ఉంటుంది. చైర్మన్ రేసులో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య గట్టి పోటీ నెలకొంది. డైరెక్టర్లతో చైర్మన్ పదవి కోసం బేరసారాలు కొనసాగుతుండగా చైర్మన్ పదవి ఎవరికి దక్కుతుందో వేచి చూడాల్సిందే.

పీఏసీఎస్ చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్

కులకచర్ల, ఫిబ్రవరి 16: కులకచర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ఎన్నికకు జిల్లా సహకార సంఘాల అధికారి ఈశ్వరయ్య నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈనెల 18న ఉదయం 9గంటలకు స్థానిక కార్యాలయంలో చైర్మన్ ఎన్నిక ఉంటుందని, డైరెక్టర్లు పాల్గొనాలని సూచించారు. ఈ మేరకు శుక్రవారం డైరెక్టర్లకు నోటీసులు అందజేశారు. సంఘంలో 13 మంది డైరెక్టర్లు ఉండగా తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చైర్మన్ పదవికి రాజీనామా చేయడంతో ఎన్నిక అనివార్యమైంది. చైర్మన్ రేసులో కొత్తగా డైరెక్టర్‌గా ఎన్నికైన తిరుమలాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు కనకం మొగులయ్య పేరు బలంగా వినిపిస్తోంది.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

దోమ, ఫిబ్రవరి 16: బొంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వెంకట్ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై పరిగి అగ్నిమాపక శాఖ అధికారులు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రత్యక్షంగా చూపించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం షఫీ, అగ్నిమాపక సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీఆర్‌పీఆర్వోగా బాధ్యతలు చేపట్టిన చెన్నమ్మ



కలెక్టర్‌ను కలిసిన డీపీఆర్వో

వికారాబాద్, ఫిబ్రవరి 16 : వికారాబాద్ జిల్లా పౌర సంబంధాల అధికారి (డీపీఆర్వో)గా చెన్నమ్మ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. వికారాబాద్‌లో విధులు నిర్వహించిన మహమ్మద్ ఆరిఫొద్దీన్ గద్వాల్ డీపీఆర్వోగా బదిలీ అయ్యారు. అక్కడ పనిచేసిన చెన్నమ్మ బదిలీపై వికారాబాద్‌కు వచ్చారు. బాధ్యతలు చేపట్టే క్రమంలో జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌ను వారి చాంబర్లలో ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు.

గులాబీలో చీలికలు.. హస్తంలో చేరికలు!

- కాంగ్రెస్‌లో చేరిన జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి, ఆమె కుమారుడు రినీష్‌రెడ్డి
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి తరలివచ్చిన నేతలు, కార్యకర్తలు

రంగారెడ్డి అర్బన్, తాండూరు, ఫిబ్రవరి 16 : కాంగ్రెస్‌లో కీలక నేతల చేరికలతో రాజకీయ పరిణామాలు ఏవిధంగా మారబోతున్నాయనే అంశం ఆసక్తిరంగా మారింది. తాజాగా మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి సతీమణి, వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం గాంధీ భవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. సునీతారెడ్డితో పాటు ఆమె కుమారుడు రినీష్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం సీఎం ముఖ్య సలహాదారు వేంనరేందర్‌రెడ్డి పట్నం ఫ్యామిలీని వెంటబెట్టుకొని అసెంబ్లీకి తీసుకెళ్లారు. అక్కడ సీఎం రేవంత్‌రెడ్డి సునీతారెడ్డి ఆమె కుమారుడు రినీష్‌రెడ్డికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరికల సందర్భంగా గాంధీ భవన్ సందడిగా మారింది. చేవెళ్ల లోక్‌సభ సీటుపై హామీతోనే పట్నం సునీతామహేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరారనే వార్తలు వినిపిస్తున్నాయి. చేవెళ్ల నుంచి బీజేపీ, బీఆర్‌ఎస్ తరఫున బలమైన అభ్యర్థులు బరిలో ఉండటంతో కాంగ్రెస్ కూడా నియోజకవర్గంపై పట్టున్న పట్నం ఫ్యామిలీని రంగంలోకి దింపాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే పలు దఫాలుగా చర్చలు జరిపిన పట్నం కుటుంబ సభ్యులు ఎట్టకేలకు ఎంపీ సీటు కోసం లైన్ క్లియర్ కావడంతో సునీతారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలుస్తోంది.

మహేందర్‌రెడ్డి ఇంటి వద్ద కోలాహలం

ఉదయం నుంచి హైదరాబాద్‌లోని మహేందర్‌రెడ్డి ఇంటి దగ్గర కార్యకర్తలు, అభిమానులు, నాయకులతో కోలాహలం నెలకొంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నలుమూలల నుంచి నాయకులు తరలి వచ్చారు. గాంధీ భవన్‌లోను ఇదే కోలాహలం కనిపించింది. అయితే తన అనుచరులు ఎవరు కూడా పార్టీలో కలవలేదు. త్వరలో నియోజకవర్గాల ఎమ్మెల్యేల సమక్షంలో పార్టీలో చేర్చుకోవాలని పార్టీ పెద్దలు నిర్ణయించడంతో మిగితా నాయకులెవరు చేరలేదు. కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే జయ్‌వీర్‌రెడ్డి, కాల్వ సుజాత, లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

హస్తం గూటికి అల్లు అర్జున్ మామ

టాలీవుడ్ హీరో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మామ కంజర్ల చంద్రశేఖర్‌రెడ్డి బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం గాంధీభవన్‌లో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ దీపాదాస్ మున్షీ పార్టీ కండువా కప్పి ఆయనను పార్టీలోకి ఆహ్వానించారు. తనకు బీఆర్‌ఎస్‌లో అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు తన సొంతగూటికి చేరానని, గతంలో యూత్ కాంగ్రెస్‌లో పనిచేశానని చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ తరఫున హైదరాబాద్ శివార్లలో ఇబ్రహీంపట్నం లేదా మరో నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని అనుకున్నాను. కానీ చాన్స్ లభించలేదన్నారు. ఆయన మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు ఆసక్తితో ఉన్నట్లు, అందుకే కాంగ్రెస్‌లో చేరినట్లు ప్రచారం సాగుతోంది.

23ఏళ్ల తర్వాత గాంధీభవన్‌కు..

రాజకీయంగా 1992 నుండి ప్రతిపక్షంలోనే ఉన్న మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి 23 ఏళ్ల తర్వాత గాంధీభవన్ వచ్చారు. 2000 సంవత్సరంలో మహేందర్‌రెడ్డి మేనమామ మాజీ హోంమంత్రి స్వర్గీయ ఇంద్రారెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన తర్వాత ఆయన భౌతికకాయాన్ని గాంధీభవన్‌కు తీసుకొచ్చిన సమయంలో టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న మహేందర్‌రెడ్డి తప్పనిసరి పరిస్థితుల్లో గాంధీభవన్‌కి వచ్చారు. అప్పటికింకా రాజకీయాల్లోకి రాని సునీతారెడ్డి కూడా ఆయన వెంట వచ్చారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు గాంధీభవన్‌కు వచ్చారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

జడ్పీ చైర్‌పర్సన్ సునీతామహేందర్‌రెడ్డి వెంట తాండూరుకు చెందిన పలువురు శుక్రవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్‌లో చేరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నపరిమళ్, మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు, మాజీ జడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్, బషీరాబాద్ పీఏసీఎస్ చైర్మన్ వెంకటరామిరెడ్డి, బషీరాబాద్‌కి చెందిన శంకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ గాజీపూర్ నారాయణరెడ్డి, డీవై నర్సింలు ఉన్నారు.

ఎండోమెంట్ చేతికి వేంకటేశ్వరాలయం

- ఇక నుంచి ప్రభుత్వం ఆధీనంలో నిర్వహణ
- ఈవోను నియమించిన దేవాదాయ శాఖ

పరిగి, ఫిబ్రవరి 16 : పరిగి పట్టణంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయం ఎండోమెంట్ శాఖ పరిధిలోకి వెళ్లింది. ఇక నుంచి దేవాలయ నిర్వహణంతా అధికారుల పర్యవేక్షణలో కొనసాగబోతుంది. 37 ఏళ్ల క్రితం ఈ దేవాలయాన్ని నిర్మించగా రాజకీయ ఆధిపత్యం కారణంగా కొంతకాలంగా వివాదంగా మారింది. 2016లో నాటి (ప్రస్తుత) ఎమ్మెల్యే టి రామ్మోహన్‌రెడ్డి ఈ దేవాలయాన్ని దేవాదాయ శాఖ పరిధిలోకి తీసుకోవాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా ఆశాఖ పరిధిలోకి వెళ్ళింది. 2018 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా కె.మహేశ్‌రెడ్డి ఎన్నికైన తర్వాత నాటి ఆయల కమిటీ అప్పటి మంత్రి ఎ.ఇంద్రకరణ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దేవాదాయ శాఖ తాత్కాలిక స్టే ఇచ్చిన కారణంగా పాత కమిటీ ఐదేళ్ళు కొనసాగింది. దేవాలయం పునర్నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి రూ.35 నుంచి రూ.50 లక్షల నిధులు కేటాయించగా, విరాళాల ద్వారా వచ్చిన మరో రూ.60 లక్షలతో కలిపి మొత్తం కోటికిపై వ్యయయంతో దేవాలయాన్ని పునర్నించారు. ఇటీవల ఎమ్మెల్యేగా ఎన్నికైన టి.రామ్మోహన్‌రెడ్డి దేవాదాయ శాఖ స్వాధీనం చేసుకోవాలని తిరిగి లేఖ రాశారు. ఈ మేరకు సంబంధిత అధికారులు ఇటీవల దేవాలయాన్ని సందర్శించి పరిశీలించారు. ఆలయ నిర్మాణం, స్థలం, దుకాణాలు, ఆదాయం, ఖర్చులు, ఆభరణాల వివనాలను తెలుసుకున్నారు. దేవాలయ పునర్నిర్మాణానికి వచ్చిన ప్రభుత్వ నిధులు, విరాళాల వివరాలు పది రోజుల్లో అందజేయాలని అధికారులు ఆలయ కమిటీకి చెప్పారు. దేవాలయ నిర్వహణ ఇక ప్రభుత్వం పరిధిలోనే జరుగుతుందని వారు స్పష్టం చేశారు. ఈ మేరకు కార్యనిర్వహణ అధికారిని (ఈవో) కూడా ప్రభుత్వం నియమించింది. ఇక నుంచి నిత్యపూజలు, నిర్వహణ, ఉత్సవాలు అన్నీ ప్రభుత్వం పర్యవేక్షణలోనే కొనసాగనున్నాయి.



శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి దేవాలయం

ఇక నుంచి ప్రభుత్వం పరిధిలో జరుగుతాయి.



దేవాలయం ఇక నుంచి దేవాదాయశాఖ పరిధిలోనే కొనసాగుతుంది. ఆలయానికి ప్రాథమికంగా మూడెకరాల స్థలం, 22 దుకాణాలు ఉన్నట్లు గుర్తించాం. ప్రభుత్వం ఇచ్చిన నిధులు, విరాళాల వివరాలు, నిర్మాణానికి చేసిన ఖర్చుల వివరాలు ఇవ్వాలని ఆలయ కమిటీకి సూచించాం. షాపులను త్వరలోనే స్వాధీనం చేసుకుంటాం. దేవుడి ఆభరణాలు కొన్ని ఇతరుల దగ్గర ఉన్నట్లు గుర్తించాం. వాటిని సేకరిస్తాం.

\- శ్రీనివాస్, ఈవో

గనులపై రాయల్టీని తగ్గించాలి : ఎమ్మెల్యే

- అసెంబ్లీలో మాట్లాడిన మొదటి సారే నియోజకవర్గ సమస్యల ప్రస్తావన
- కందిబోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తాండూరు, ఫిబ్రవరి 16 : రాష్ట్రంలో సుద్ద, నాపరాయి రాయల్టీ కర్ణాటక కన్నా ఎక్కువ ఉన్నందని, దాన్ని తగ్గించాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. రాయల్టీని పెంచడం వల్ల సంబంధిత వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళారు. అసెంబ్లీలో మాట్లాడిన మొట్టమొదటి సారే తాండూరు నియోజకవర్గ సమస్యలపై శుక్రవారం ఆయన గళమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ల సొంత జిల్లా అని ఎమ్మెల్యే గుర్తుచేస్తూనే, నియోజకవర్గ సమస్యలను సభలో ఎమ్మెల్యే విన్నవించారు. తాండూరు కంది పంటకు దేశవ్యాప్తంగా జీఐ గుర్తింపు పొందిందని, కందిబోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. నియోజకవర్గంలోని కోట్‌పల్లి, జుంటుపల్లి ప్రాజెక్టుల ఆధునీకరణకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. తాండూరులో మైనింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని, ఐటీఐ కాలేజీలలో మౌళిక సదుపాయాలు కల్పించాలని చెప్పారు. బషీరాబాద్ జూనియర్ కళాశాలలో మౌళిక సదుపాయాలు కల్పించాలని, అధ్యాపకులను నియమించాలని విజ్ఞప్తి చేశారు.

ఇన్నీ సమస్యలా... రోహిత్‌రెడ్డి తీర్చలేదా!

తాండూరులో ఇంకా ఇన్నీ సమస్యలున్నాయా! మా పార్టీ నుంచి గెలిచి అభివృద్ధి కోసం పార్టీ మారానని చెప్పిన రోహిత్‌రెడ్డి ఎంతో చేశారనుకున్నా.. సమస్యలు తీర్చలేదా అని మంత్రి కోమటిరెడ్డి ఎద్దేవా చేశారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

- టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు శివకుమార్
- నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపిన ఉద్యోగులు



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

వికారాబాద్, ఫిబ్రవరి 16 : సీపీఎస్‌ను రద్దుచేసి పాతపెన్షన్ (ఓపీఎస్) విధానాన్ని కేంద్రప్రభుత్వం పునరుద్ధరించి అమలు చేయాలని టీఎన్జీవోస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం. శివకుమార్ అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ఉద్యోగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా శుక్రవారం భోజన విరామ సమయంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలతో ప్రభుత్వ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను తామెప్పుడూ వ్యతిరేకిస్తామని చెప్పారు. టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి అజ్మత్ పాషా, అసోసియేట్ అధ్యక్షుడు నర్సింహులు, కోశాధికారి రమేష్, మండలాధ్యక్షుడు మల్లేష్ గౌడ్, వైస్‌ప్రెసిడెంట్ అరుణకుమారి, ఉమెన్ జాయింట్ సెక్రటరీ శ్రావణి, జాయింట్ సెక్రటరీస్ హీరాలాల్, సాయి కుమార్, ఆఫీస్ సెక్రటరీ శ్రీకాంత్ రెడ్డి, నిర్మల శ్రీదేవి, విజయ్, లాలూ, నరేందర్, శ్రీకాంత్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు వాసు, మాణిక్యం, వివిధ శాఖల ఫోరం అధ్యక్షులు, ఉద్యోగులు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

బదిలీలు సర్వసాధారణం : ఎస్పీ



బదిలీపై వెళుతున్న పోలీసు అధికారులను సన్మానిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 16 : ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని ఎక్కడికి వెళ్లినా ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా పని చేసి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి సూచించారు. శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించి బదిలీ అయిన అధికారులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిలీ అయిన పోలీస్ అధికారులు వెంటనే వారి స్టేషన్‌ల పరిధిలోని ముఖ్యమైన సమాచారం సున్నితమైన విషయాలను తెలుసుకోవాలని చెప్పారు. అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, డీటీసీ అదనపు ఎస్పీ మురళీధర్, పరిగి డీఎస్పీ కరుణసాగర్, వికారాబాద్ డీఎస్పీగా పనిచేసి బదిలీపైన వెళుతున్న నర్సింహులు, తాండూరు నుంచి బదిలీపై వెళుతున్న శేఖర్‌గౌడ్, బదిలీపై వచ్చిన బాలకృష్ణరెడ్డి, సైబర్ సెక్యూరిటీ వింగ్‌కు బదిలీపైన వెళుతున్న హనుమంత్‌రావు, ఏఆర్ డీఎస్పీ వీరేశ్, సీఐ, ఎస్ఐలు పాల్గొన్నారు.

స్క్రాబ్ గోదాంలో అగ్ని ప్రమాదం

- ఎగసిపడిన మంటలు
- మంటలను ఆర్పిన ఫైర్ సిబ్బంది



మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది

పూడూరు, ఫిబ్రవరి 16 : వికారాబాద్ జిల్లా పూడూరు మండలం మన్నెగూడ సమీపంలో పొలాల మధ్య ఉన్న స్క్రాబ్‌గోదాంలో శుక్రవారం మంటలు చెలరేగడంతో భారీ అగ్నిప్రమాదం జరిగింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న వికారాబాద్ ఫైర్ సిబ్బంది 3 గంటలు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. స్క్రాబ్ గోదాంలో అక్రమంగా నిల్వ ఉంచిన మెడీ వేస్టేజ్ కెమికల్ బాటిల్స్, ప్లాస్టిక్ వస్తువులు ఉండటంతో మంటలు భారీగా ఎగిసిపడ్డాయి. దీంతో పక్కనే ఉన్న గులాబీతోట పూర్తిగా అగ్నికి ఆహుతైంది. ఈ విషయమై చన్‌గోముల్ ఎస్సై మధుసూదన్‌రెడ్డిని వివరణ కోరగా తమకు సమాచారం లేదని తెలిపారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి

- డీఎల్పీవో శంకర్‌నాయక్



పన్నుల వసూలును పరిశీలిస్తున్న డీఎల్పీవో

బొంరాస్‌పేట్, ఫిబ్రవరి 16 : మార్చి నెలాఖరు వరకు గ్రామపంచాయతీల్లో ఇంటి పన్నులను పూర్తిస్థాయిలో వసూలు చేయాలని డీఎల్పీవో శంకర్‌నాయక్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. పన్నుల వసూళ్లలో పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. శుక్రవారం ఆయన బురాన్‌పూర్ గ్రామంలో పర్యటించారు. బొంరాస్‌పేట్ మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 52 శాతం పన్నులు వసూలు అయినట్లు తెలిపారు. తాండూర్ డివిజన్ వ్యాప్తంగా రూ.3 కోట్ల 31 లక్షల ఇంటి పన్నుల వసూలు పెండింగ్ ఉండగా ఇప్పటి వరకు రూ.1కోటి 67 లక్షలు వసూలు అయినట్లు చెప్పారు. బురాన్‌పూర్‌లో సీసీ రోడ్డు నిర్మాణంలో ప్రైవేట్ వ్యక్తులు, ఇతరులకు ఇబ్బందులు కలగకుండా సమస్యను పరిష్కరించాలని సూచించారు.

బాధ్యతలు స్వీకరించిన ఎక్సైజ్ సూపరింటెండెంట్



విజయభాస్కర్‌ను సత్కరిస్తున్న అధికారులు, సిబ్బంది

వికారాబాద్, ఫిబ్రవరి 16 : వికారాబాద్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా విజయభాస్కర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. పూల మాలలు, శాలువాలతో సన్మానించారు. పలువురు సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు న్యాక్ ఏప్లస్



సంబురాలు చేసుకుంటున్న కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 16 : ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని కొండాపూర్‌లో గల విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాల నేషనల్ అక్రిడేషన్ కౌన్సిల్‌లో(న్యాక్) ఏ ప్లస్‌గ్రేడ్ వచ్చింది. దీంతో శుక్రవారం కళాశాలలో కేక్ కట్‌చేసి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సీఈవో శ్రావణ్, ప్రిన్సిపాల్ అప్పారావు నాయుడును అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం, అధ్యాపకుల నిరంతర కృషి, విద్యార్థుల శ్రమ అన్నీ కలిస్తేనే న్యాక్‌ను సాధించామని తెలిపారు. రానున్న మూడు నెలల్లో కళాశాలకు అటానమస్ లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య, విజ్ఞాన్ స్కూల్స్ చైర్‌పర్సన్ రాణిరుద్రమదేవి యాజమాన్యాన్ని అభినందించారు.

కాగ్నానదిలో ఇసుకను కొల్లగొడుతున్న అక్రమార్కులు


- అనుమతికి మించి ఇసుక తరలింపు



ఇసుకను ట్రాక్టర్‌లో నింపుతున్న కూలీలు

బషీరాబాద్, ఫిబ్రవరి 16 : ప్రభుత్వ అభివృది పనులు, ప్రైవేటు నిర్మాణాల పేరిట అనుమతి పొందిన కొంత మంది ట్రాక్టర్ యజమానులు ఇదే అదనుగా కాగ్నానదిని తోడేస్తున్నారు. నిబంధనల ప్రకారం ట్రాక్టర్‌కు మూడు ట్రిప్పుల చొప్పున అనుమతి ఇస్తే ఆరు ట్రిప్పులకు పైగా ఇసుకను తరలిస్తూ నవాంద్గీ శివారులోని వాగును ఖాళీ చేస్తున్నారు. ఇదంతా రెవెన్యూ, మైన్స్ అధికారులకు తెలిసినా అంతగా పట్టించుకోవడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ప్రభుత్వానికి డీడీ రూపంలో రావాల్సిన ఆదాయానికి భారీగా గండి పడుతోంది. బషీరాబాద్ రెవెన్యూ కార్యాలయం నుంచి ప్రభుత్వ, ప్రైవేటు నిర్మాణాలకు అధికారులు ఇసుకను తీసుకునేందుకు వారంలో మూడు రోజులు అనుమతులు జారీ చేస్తున్నారు. అనుమతి ఇచ్చిన రోజు ప్రతి ట్రాక్టర్‌కు మూడు ట్రిప్పుల ఇసుకను తరలించేందుకు రెవెన్యూ అధికారులు అనుమతి పత్రాలు జారీ చేస్తున్నారు. ట్రాక్టర్ల యజమానులు ఒక్కో ట్రిప్పుకు ప్రభుత్వానికి రూ.600 చలానా కట్టి ఇసుక అనుమతి పొందుతున్నారు. వీరికి ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇసుకను తరలించడానికి సమయం కేటాయిస్తూ అనుమతిస్తున్నారు. ఇదే అదనుగా కొంత మంది ట్రాక్టర్ల యజమానులు, గుత్తేదారులు అక్కడున్న మైన్స్ సిబ్బందిని మచ్చిక చేసుకుని అనుమతుల పేరిట ఇష్టారాజ్యంగా ఇసుకను తరలిస్తున్నారనే ఆరోపణలున్నాయి. నది వద్ద మైన్స్, రెవెన్యూ సిబ్బంది ఇసుక ట్రాక్టర్లకు వే బిల్లులు ఇస్తున్నా వారికి డబ్బు ఆశచూపి నిర్ణీత సమయం దాటినా కూడా ఇసుకను అక్రమంగా తరలించుకుపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అనుమతి పేరిట మూడు.. అక్రమంగా మరో రెండు, మూడు ట్రాక్టర్ల ఇసుకను తరలించడం ఇక్కడ షరా మూమూలేనన్న చర్చలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా అనుమతుల పేరుతో ఇసుక అక్రమ దందాకు పాల్పడుతున్నా వారిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని నవాంద్గీ గ్రామ యువకులు పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్ గూటికి నవాంద్గీ సొసైటీ చైర్మన్, ఏఎంసీ మాజీ చైర్మన్



సునీతారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వెంకట్‌రాంరెడ్డి, తదితరులు

బషీరాబాద్, ఫిబ్రవరి 16: నవాంద్గీ పీఏసీఎస్ చైర్మన్ ఎ.వెంకట్‌రాంరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ అరుణగోపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పి.సుధాకర్‌రెడ్డి, గొట్టిగ శ్రీనివాస్‌రెడ్డి, పి.మాణిక్‌రెడ్డి, నాయకులు శుక్రవారం కాంగ్రెస్ గూటికి చేరారు. పట్నం సునీతారెడ్డి తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి, సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆమెకు మద్దతుగా పెద్దసంఖ్యలో నాయకులు హాజరై వెంట నడిచారు. అనంతరం సునీతారెడ్డి వీరికి కాంగ్రెస్ కుండువాకప్పి స్వయంగా కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఇదేబాటలో మరికొంత మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు సమాచారం.

తీరొక్క పండ్ల చెట్లకు ఆవాసం ఆతోట

- ప్రతికూల పరిస్థితిల్లోనూ ముందంజ



పూతతో ఉన్న కాజు చెట్టును చూపిస్తున్న కృష్ణ

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 16 : నగరానికి చేరువలో ఇక్కడి వాతావరణంలో పండని అనేక రకాల పండ్ల మొక్కలను పెంచి పోషించి, ఫలాలను అందుకుంటున్నారు ఓ రైతు. అయనే నారపల్లికి చెందిన నిమ్మకాయల కృష్ణ. ఘట్‌కేసర్‌లో ఆయనకు ఆరెకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో వివిధ రకాల పండ్లచెట్లను పెంచుతున్నారాయన. ఆ తోటలో తీరొక్క పండ్లు దొరుకుతాయి. వాటితో పాటు తీగజాతి మొక్కలైన కాకర, బీర, సొర, చిక్కుడు, టమాట, వంకాయ, ఉల్లి, మొక్కజొన్న పంటతోపాటు పలురకాల ఆకు కూరలను కూడా సాగు చేస్తున్నారు. అంతటా ప్రతికూల పరిస్థితులు ఏర్పడినా ఆ తోటలో మాత్రం సానుకూలతే ఉంటుంది.

అంతా సేంద్రీయ పద్ధతే

ఇక్కడ అన్ని పంటలకూ సేంద్రీయ ఎరువునే ఆయన వాడుతున్నారు. దీంతో మొక్కలన్నీ ఏపుగా పెరిగి నిగనిగలాడుతున్నాయి. సేంద్రీయ ఎరువులను వాడి పండించిన ఆర్గానిక్ పంటలకు మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ పద్దతులను అవలంబిస్తున్నారు.

తీరొక్క పండ్ల నిలయం

కృష్ణ తోటలో అనేక రకాల పండ్ల చెట్లు ఉన్నాయి. ప్రధానంగా రామసీతాఫలం, లక్ష్మణఫలం, స్టార్‌ఫ్రూట్స్, దానిమ్మ, బొప్పాయి, జామ, పనసపండ్ల చెట్లు ఉన్నాయి. లక్ష్మణఫలాలకు ఎక్కువ డిమాండ్ ఉంది, ఇవి క్యాన్సర్ నివారణకు ఔషధంగా పనిచేస్తాయని భావించి వీటిపై చాలా మంది మక్కువ చూపుతున్నారు. అలాగే రామసీతా ఫలం చెట్లు కూడా ఇక్కడ విరివిగా ఉన్నాయి.

మొక్కల ఎంపికలోనే జాగ్రత్తలు

అనేక రకాల పండ్ల మొక్కలను బెంగుళూరు, రాజమండ్రిలోని కడియంకు వెళ్లి తీసుకువచ్చినట్లు కృష్ణ తెలిపారు. మార్కెట్‌లో కనింపించన అనేక రకాల పండ్ల మొక్కలను ఇక్కడ సాగుచేస్తున్నారు. అందుకోసం ఆయన నిరంతరం శ్రమిస్తూ ఎక్కువ సమయం తోటలోనే గడుపుతున్నారు.

నిరంతర కృషితో అన్నీ సాధ్యమే రైతు

తోటను జాగ్రత్తగా గమనిస్తుండాలి. మొక్కలకు ఏ సమయంలో ఎరువులు వేయాలి, ఏ సమయంలో నీళ్లు పెట్టాలి వంటి జాగ్రత్తలు అవసరం. ఎక్కువ సమయం తోటలోనే ఉండి పని చేస్తా. ఏమైనా సమస్యలు వస్తే తోటల సాగులో అనుభవం కలిగిన వారితో చర్చించి సస్య రక్షణ చర్యలు తీసుకుంటా.

\-నిమ్మకాయల కృష్ణ, యజమాని

ముస్లీం వెల్ఫేర్ అసోసియేషన్‌లో వర్గపోరు

- దుకాణ సముదాయాలు, ఇతర స్థలాల విషయంలో తగాదాలు



మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకులు

తాండూరురూరల్, ఫిబ్రవరి 16 : తాండూరు ముస్లిం వెల్ఫేర్‌లో గ్రూపు తగాదాలు నెలకొన్నాయి. వెల్ఫేర్‌లోని నాయకులు అబ్దుల్‌హాదీ, కమల్ అఖ్తర్ మధ్య దుకాణ సముదాయ, ఇతర భూముల వ్యవహారాల్లో గ్రూపు విభేదాలు ఏర్పడి గొడవలకు దారితీస్తున్నాయి. ఈ మేరకు శుక్ర వారం తాండూరు ముస్లీం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కమల్ అఖ్తర్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమల్ అఖ్తర్, పలువురు నాయకులు మాట్లాడుతూ పట్టణంలోని దుకాణ సముదాయం, ఖబ్రస్థాన్, ఈద్గాల భూముల వ్యవహారాల్లో అబ్దుల్ హాదీ ఆటలు చెల్లవని పేర్కొన్నారు. కేవలం అబద్ధపు మాటలు, డాక్యుమెంట్లతో కాలం వెళ్లదీయాలని చూస్తున్నారని ఆరోపించారు. దుకాణ సముదాయాలు ముస్లిం వెల్ఫేర్‌వేనని, వాటిని సంబంధించిన మండల సర్వే రిపోర్టు కూడా ఉందని చెప్పారు. అట్టి దుకాణాలు, స్థలాలపై వారికి ఎలాంటి హక్కు లేదన్నారు. అబద్దాలతో ప్రజలను ఎక్కువ రోజులు మోసం చేయలేరని విమర్శించారు. ముస్లీం వెల్ఫేర్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ బాబర్, ప్రధాన కార్యదర్శి ఖాలీద్ సైఫుల్లా, ఉపాధ్యక్షుడు బాసిత్‌అలీ, శుకూర్ ఖాన్, ఖయ్యూం, ఖలీల్‌ఉల్లా, ఆసీఫ్ అలీ, డాక్టర్ జియా, సలీం, ఇమాన్‌ఖాన్, ఇంతియాజ్ బాబా, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

‘భారత్ బంద్’ విజయవంతం

- కార్మికులు, కర్షకుల పట్ల కేంద్ర విధానాలను నిరసిస్తూ ధర్నా, నిరసన కార్యక్రమాలు
- బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- పాల్గొన్న వామపక్ష, కార్మిక సంఘాల నాయకులు

షాద్‌నగర్, ఫిబ్రవరి 16 : కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ విధానాలను విడనాడాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలో నిర్వహించిన సమ్మెలో ఆయన పాల్గొన్నారు. మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కార్పొరేట్ శక్తులకు రెడ్ కార్పెట్ పరుస్తూ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. సీఐటీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు, కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ పినపాక ప్రభాకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజలపై తీవ్ర



రంగారెడ్డి అర్బన్ : కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు

ఆర్థిక భారాన్ని మోపుతుందని ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంతో ఘోరంగా విఫలమైందన్నారు. కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసేందుకు నాలుగు రకాల లేబర్ కోడ్‌లను సిద్ధం చేసిందని వారు ఆరోపించారు. ఆందోళనలో పలు కార్మిక సంఘాలకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యాచారం : కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపట్టిన భారత్ బంద్ విజయవంతమైంది. ఈసందర్భంగా రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు పి.జంగారెడ్డి మాట్లాడుతూ బీజేపీ దేశంలో మరో బ్రిటిష్ పాలనను తలపిస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసగా శుక్రవారం దేశవ్యాప్త బంద్ సందర్భంగా యాచారం మండల కేంద్రంలో పలు ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించి మండల కేంద్రంలో రాస్తారోకో చేశారు. సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, సీఐటీయూ జిల్లా నాయకులు పి.బ్రహ్మయ్య, పి.అంజయ్య, మల్లేష్, శ్రీమన్నారాయణ, డీవైఎఫ్ఐ నాయకుడు మ ల్లేష్, రైతు సంఘం నాయకులు శ్రీశైలం, గీత కార్మిక సంఘ నాయకులు వెంకటయ్య తదితరులున్నారు.

మంచాల : దేశవ్యాప్త సమ్మెలో భాగంగా కార్మిక, కర్షక సంఘాలు చేపట్టిన గ్రామీణ భారత్‌బంద్ మండల పరిధిలో ప్రశాంతంగా జరిగింది. ఈ సందర్భంగా ఆరుట్ల, జాపాల, లోయపల్లి, రంగాపూర్ చౌరస్తాల్లో రాస్తారోకో చేసి కార్మికులు నిరసన తెలిపారు. మంచాలలో కార్మిక సంఘాల అధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండు వరకు ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ మండల కన్వీనర్ కృష్ణ, నాయకులు పాండు, శేఖర్‌రెడ్డి, తదితరులున్నారు.

కేశంపేట : ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న



కందుకూరు : నిరసన ర్యాలీలో పాల్గొన్న రాంచందర్, బాల్‌రాజు, బి.శ్రీనివాస్



షాద్‌నగర్ : చౌరాస్తాలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

భోజన, గ్రామ పంచాయతీ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. కార్మికుల పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఆయా సంఘాల నాయకులు ఖండించారు. ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు టంగుటూరి నర్సింహారెడ్డి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు, సీఐటీయూ మండల కన్వీనర్ బేరి శ్రీనివాస్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ మండలాధ్యక్షురాలు జయమ్మ, ఆశాల యూనియన్ మండలాధ్యక్షురాలు సుజాత, మధ్యాహ్న భోజన కార్మికులు అలివేలు, ఏఐటీయూసీ నాయకులు గోవింద్‌నాయక్, రాంచంద్రయ్య, పారేషా, దామోదర్ రెడ్డి లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల : కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ మతతత్వ విధానాలను ప్రతి ఒక్కరూ తిప్పికొట్టాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి, సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డీజీ నర్సింగ్‌రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య అన్నారు. మండల కేంద్రంలోని హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారిపై సీపీఐ, సీపీఎం, ఏఐటీయూసీ, సీఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్, మతతత్వ విధానాలను ధిక్కరిస్తూ దేశవ్యాప్తంగా కార్మికులు సమ్మెకు దిగడం జరిగిందన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారం



శంషాబాద్ : ర్యాలీలో పాల్గొన్న కార్మికులు

లోకి వచ్చిన పదేళ్లలో రైతాంగ, కార్మిక వర్గాల సమస్యలు పరిష్కరించకపోవడం దారుణమన్నారు. బీజేపీ మతతత్వ విధానాలను ప్రోత్సహిస్తుందన్నారు. రాష్ట్ర రైతు కూలీ సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి, మండల కార్యదర్శి సత్తిరెడ్డి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్, మండల నాయకులు నారాయణ, జంగయ్య, నర్సింహ, మంజుల, తదితరులు ఉన్నారు.

కొందుర్గు : కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య అన్నారు. గ్రామీణ భారత్‌బంద్‌లో భాగంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను, వ్యాపార సంస్థలను మూయించారు. అరగంట పాటు రాస్తారోకో చేశారు. సీఐటీయూ మండల కన్వీనర్ గోపాల్, తదితరులున్నారు.

ఆమనగల్లు : బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, ఉద్యోగ, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ వామపక్ష, కార్మిక సంఘాలు ఇచ్చిన దేశ వ్యాప్త సమ్మె, గ్రామీణ భారత్ బంద్ ఆమనగల్లు పట్టణంలో విజయవంతమైంది. ఆమనగల్లు పట్టణంలో సీఐటీయూ, రైతు సంఘం, అంగన్‌వాడీ, ఆశా, మున్సిపల్, మధ్యాహ్న భోజన, హమాలీ కార్మి



యాచారం మండల కేంద్రంలో రాస్తారోకో చేస్తున్న సీపీఎం, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు

కులు గ్రామీణ బంద్ పాటించారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. రాజీవ్ చౌక్‌వద్ద రాస్తారోకో చేశారు. మానవహారం నిర్వహించి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి మధుసూధన్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు కానుగుల వెంకటయ్య, గొర్రెలకాపరుల సంఘం జి ల్లా ఉపాధ్యక్షుడు పెంటయ్య, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్, కేవీపీఎస్ జిల్లా నాయకుడు దు బ్బ చెన్నయ్య, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రా ష్ట్ర



కేశంపేట మండల కేంద్రంలో మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులు

అధ్యక్షురాలు స్వప్న, అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు యాదమ్మ, సంగీత, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు బీబీసల్మా, జ్యోతి, నిర్మల, శిరీష, మున్సిపల్ వర్కర్స్ యూనియ న్ జిల్లా ఉపాధ్యక్షురాలు హంసమ్మ, మండలాధ్యక్షుడు విజయ్, పద్మ, లక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నంలో పలు ప్రజా సంఘాలు ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేశాయి. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలను ప్రోత్సహిస్తుందంటూ పలువురు నాయకులు ఆరోపించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు సామ్యేల్, జంగయ్య, వెంకటేష్, ఆనంద్, పురుషోత్తం, శంకర్, బాలమణి, ఎల్లేష్, జగన్ తదితరులున్నారు.

రంగారెడ్డి అర్బన్ : సెకండ్ ఏఎన్ఎంలను వెంటనే పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి యాదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సెకండ్ ఎంఎన్ఎంలకు సంఘీభావం తెలిపారు. కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయకుండా మోదీ కార్మిక చట్టాలను లేబర్ కోడ్ లుగా మార్చారని చెప్పారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నారని, కార్పొరేట్‌శక్తుల రుణ మాఫీ రూ.11లక్షల కోట్లు చేసిందన్నారు. ఈమేరకు అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు వినతిపత్రం అందించారు. రెండో ఏఎన్ఎం సంఘం జిల్లా అధ్యక్షురాలు పద్మ, నాయకురాళ్లు జయమ్మ, సుజాత, స్వర్ణలత, విజయలక్ష్మి, రజని, లిల్లీ, తదితరులున్నారు.

కొత్తూర్ : కార్మికుల సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం నిర్వహించిన దేశ వ్యాప్త సమ్మె కొత్తూర్ మండలంలో విజయవంతమైంది. సీఐటీయూ, టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించి, కొద్దిసేపు రాస్తారోకో నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బీసా సాయి బాబా, టీఎన్‌టీయూసీ నాయకుడు యాదగిరిచారి, నాట్కో యూనియన్ ప్రధానకార్యదర్శి మల్లేష్, , అంగన్‌వాడీ, ఆశా, ఆయాలు, జీపీ కార్మికుల్లున్నారు.

మాడ్గుల : మండల కేంద్రంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్.రంగారెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పారిశుధ్య కార్మికులు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు. ఏఐటీయూసీ మండలాధ్యక్షుడు రాంరెడ్డి, పద్మ, నాయకులున్నారు.

కందుకూరు : ప్రధాని మోదీ కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ నిరుపేదల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్ అన్నారు. మండల కేంద్రంలో సీఐటీయూ మండల కన్వీనర్ బాల్‌రాజ్, సీపీఎం మండల కార్యదర్శి బి.శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం విజయవంతమైంది. మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించి హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.కుమార్, కేవీపీఎస్ మండల కార్యదర్శి ఆర్.చందు, సీఐటీయూ నాయకులు సాయిలు, ఎ.శ్రీనివాస్, ఎం.యాదయ్య, ఆర్.శేఖర్, జి.నత్తయ్య, కె.కుమార్, కె.శ్రీనివాస్, ఎ.కిషన్, జి.బాల్‌రాజ్‌గౌడ్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికులు గ్రామ పంచాయతీ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్ : సీపీఎం కార్యవర్గ సభ్యుడు జాన్‌వెస్లీ, మండల కన్వీనర్ నీరటి మల్లేష్‌ల ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం నుంచి బస్టాండులోని అంబేడ్కర్ చౌరస్తా వరకు కార్మిక సంఘాల కార్మికులు ర్యాలీ నిర్వహించారు. పలు కార్మిక సంఘాలకు చెందిన కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మహేశ్వరం : దేశవ్యాప్త కార్మికుల సమ్మెలో భాగంగా నిర్వహించిన బంద్ మహేశ్వరంలో విజయవంతమైంది. సీపీఎం, సీపీఐ, సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అలువాల రవికుమార్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు కొమ్ముకాస్తూ, కార్మికులను పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు దత్తునాయక్, శేఖర్, కవితలతో పాటు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం : ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు



ఆమనగల్లు : మానవహారం నిర్వహిస్తున్న కార్మికులు

కనుల పండువగా చెన్నకేశవ స్వామి కల్యాణం



తలకొండపల్లి : చుక్కాపూర్‌లో చెన్నకేశవస్వామి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

తలకొండపల్లి/ఆమనగల్లు/మాడ్గుల, ఫిబ్రవరి 16: మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని చుక్కాపూర్‌లో శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయాల్లో శుక్రవారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. తలకొండపల్లి ఆలయంలో అర్చకుడు మహేశ్ ఆధ్వర్యంలో ప్రకాశ్, నవీన్, మల్లే్శ్ దంపతులు కల్యాణం జరిపించారు. చుక్కాపూర్ ఆలయంలో అర్చకులు వెంకటేశ్వర శర్మ పర్యవేక్షణలో శ్యామ్‌శర్మ, రామశంకర శర్మ, ఆంజనేయ శర్మల ఆధ్వర్యంలో ఏమిరెడ్డి గౌరిశ్రీనివాస్ రెడ్డి దంపతుల కల్యాణం జరిపించారు. తలకొండపల్లిలో బండి పాండు, చుక్కాపూర్‌లో ఏమిరెడ్డి గౌరి శ్రీనివాస్ రెడ్డి దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ సర్పంచ్‌లు కిష్టమ్మ, లలితజ్యోతయ్య, నాయకులు, నిర్వాహకులు తదితరులున్నారు. అలాగే ఆమనగల్లు పట్టణంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు స్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు కాలె మల్లయ్య, యాట ముత్యాలు, గుండమల్ల జగన్, ఎనుముల రమేశ్, కామల్ల ప్రకాశ్, కాలే శివ, రవి, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మాడ్గుల మండలకేంద్రంలో చెన్నకేశవ స్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ సర్పంచ్ కాట్ల యాదయ్యగౌడ్, శ్రవన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, భరత్‌రెడ్డి, చిక్కుడు జంగయ్య,దార నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

శెట్టిపల్లిలో ఘనంగా రథోత్సవం

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ఆమనగల్లు మండలం శెట్టిపల్లి శ్రీ అలివేలుమంగ సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. శుక్రవారం తెల్లవారుజామున స్వామి వారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. రథోత్సవ నేపథ్యంలో మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవి సత్యం ఆధ్వర్యంలో భక్తులకు విశాల వసతులు ఏర్పాటు చేశారు. అర్చకులు ప్రత్యేక పూజలు, రుద్రహోమం నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ సింగిని శ్రీనివాస్, ఆలయ ట్రస్టీ కోట్ల జగన్మోహన్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోనుగోటి అర్జున్‌రావు, నాయకులు తదితరుల్లున్నారు.

దైవ కార్యక్రమాలు సమాజశాంతికి దోహదం

కడ్తాల్ : దైవ కార్యక్రమాలు సమాజ శాంతికి దోహదపడుతాయని రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఛైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మైసిగండి మైసమ్మ ఆలయాన్ని శుక్రవారం శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి మైసమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు చంద్రశేఖర్ రెడ్డి,శ్రీను నాయక్, సుమన్ నాయక్, గురవయ్య, అశోక్, అంజి, రాహుల్, అంజియాదవ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు బాగా చదవాలి

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 16 : విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని శ్రీవారి మిడౌస్ డెవలపర్స్ యాజమాని రావెల్ల వరప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని మోకిల గ్రామంలో తన తండ్రి వినాయకరావు జ్ఞాపకార్థం రూ.కోటీ 25లక్షలతో ప్రాథమికోన్నత పాఠశాల నిర్మాణానికి కృషి చేశారు. పాఠశాలలో చదివే విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల పిల్లలకు దీటుగా రాణించాలనే ఉద్దేశ్యంతో 7 గదులు ఒక కంప్యూటర్ హాల్‌ను నిర్మించి కంప్యూటర్లు, బెంచీలు ఏర్పాటు చేశారు. గ్రంథాలయం, సైన్స్ ల్యాబ్ తదితర సౌకర్యాలు కల్పించారు. ఈమేరకు శుక్రవారం ఆయన విద్యార్థులతో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. మోకిల మాజీ సర్పంచ్ సుమిత్రా మోహన్‌రెడ్డి, మండల విద్యాధికారి సయ్యద్ అక్బర్‌లు దాత వరప్రసాద్‌ను ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచులు నర్సింలు, అడివయ్య, అనిల్ ఉపాధ్యాయులు, తదితరులున్నారు.



విద్యార్థులతో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దాత

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు



మాట్లాడుతున్న జడ్పీటీసీ అనురాధపత్యానాయక్

ఆమనగల్లు, ఫిబ్రవరి 16 : పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు ఒత్తిళ్లను అధిగమించి ఏకాగ్రతతో ముందుకు సాగితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని జడ్పీటీసీ అనురాధపత్యానాయక్, ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో శుక్రవారం ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎంఈవో సర్దార్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి జడ్పీటీసీ, లక్ష్మణ్, మున్సిపల్ ఛైర్మన్ రాంపాల్ నాయక్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పరీక్షల్లో అనుసరించాల్సిన వ్యూహాల గురించి వివరించారు. లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, ప్రధానోపాధ్యాయులు జంగయ్య, రామనాథం, సుదర్శన్, పర్వతాలు, శ్రీను, సుజాత, పాండు, చంప్లా, లక్ష్మణమూర్తి, తదితరులున్నారు.

స్వయం ఉపాధి కోర్సులను వినియోగించుకోవాలి

కొందుర్గు, ఫిబ్రవరి, 16: నిరుద్యోగులు, యువతీ యువకులు స్వయం ఉపాధి కోర్సులను వినియోగించుకోవాలని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ డైరెక్టర్ జీఎస్ఆర్ కృష్ణ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌లో స్వయం ఉపాధి కోర్సులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్, స్వర్ణ భారత్ ట్రస్టు, జీఎంఆర్ వరలక్ష్మీ ఫౌండేషన్, మల్లారెడ్డి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ వారి సౌజన్యంతో 13 రకాల కోర్సుల్లో గ్రామీణ ప్రాంత యువతకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. 19 నుంచి 45 ఏళ్ల లోపు వారికి ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని, శిక్షణ కాలంలో భోజనం, వసతి ఉచితంగా కల్పించడం జరుగుతుందని, దరఖాస్తులను యూనియన్ బ్యాంక్‌లో అందజేయాలని సూచించారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ వెంకటేష్, తదితరులున్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేద్దాం



భీంభరత్ సమక్షంలో పార్టీలో చేరుతున్న సర్దార్‌నగర్ మాజీ సర్పంచ్ నర్సింహులు, మాజీ వార్డు మెంబర్లు, గ్రామస్తులు

షాబాద్, ఫిబ్రవరి 16 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీంభరత్ అన్నారు. శుక్రవారం షాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో సర్దార్‌నగర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మునగపాటి నర్సింహులు, మాజీ వార్డు సభ్యులు, గ్రామస్థులు పెద్దఎత్తున కాంగ్రెస్‌లో చేరగా కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్లమెంట్ ఎన్నికల్లో అధిష్టానం ఎవరికి టికెట్ ఇచ్చినా అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తామన్నారు. పార్టీకోసం కష్టపడినవారికి మంచి గుర్తింపు ఉంటుందని అన్నారు. ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి సురేందర్‌రెడ్డి, చేవెళ్ల డివిజన్ యూత్ అధ్యక్షుడు పెంటారెడ్డి, ఎంపీటీసీలు చెన్నయ్య, అశోక్, నాయకులు తమ్మలి రవీందర్, చెన్నయ్య, రాహుల్‌గుప్తా, బాల్‌రాజ్‌గుప్తా, శ్రీను, మాజీ సర్పంచులు నరేందర్‌రెడ్డి, సత్యనారాయణ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్‌గా వసంత, సీఐగా విజయ్‌కుమార్

ఆమనగల్లు, ఫిబ్రవరి 16 : ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్‌గా ఎన్.వసంత బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన శ్యామ్‌సుందర్‌ను నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటకు బదిలీ చేశారు. జల్‌పల్లి నుంచి వసంత ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్‌గా వచ్చారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ రాంపాల్ నాయక్, కౌన్సిలర్లు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించి అభినందించారు. కౌన్సిలర్లు యాదమ్మశ్రీశైలం యాదవ్, లక్ష్మణ్, విక్రమ్‌రెడ్డి, జ్యోతినర్సింహ తదితరులు ఉన్నారు. అలాగే ఆమనగల్లు సీఐగా విజయ్‌కుమార్ నియమితులయ్యారు. శుక్రవారం సైబరాబాద్ కమిషనరేట్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడ పనిచేసిన వెంకటేశ్వర్లు సైబరాబాద్ స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. సైబర్ క్రైంలో పనిచేస్తున్న విజయ్‌కుమార్‌కు ఆమనగల్లు సీఐగా పోస్టింగ్ ఇచ్చారు.

సంక్షిప్తంగా..

- **కొత్తూర్ :** మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఈనెల 20 నుంచి నిర్వహించ తలపెట్టిన బీజేపీ విజయ సంకల్ప యాత్రను జయప్రదం చేయాలని పార్లమెంట్ నియోజకవర్గ కోకన్వీనర్ అమడపురం నర్సింహగౌడ్ పిలుపునిచ్చారు. మున్సిపాలిటీలోని తిమ్మాపూర్ వద్ద వాల్ రైటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్రంలో ముచ్చటగా మూడోసారి నరేంద్రమోదీ ప్రభుత్వం రానుందన్నారు. విజయ సంకల్పయాత్రకు భారీ తరలిరావాలన్నారు. నాయకులు రమేష్, మల్లేష్, రాఘవేందర్‌రెడ్డి, రణధీర్‌గౌడ్, రాఘవులుగౌడ్, ప్రభాకరచారి, శ్రీశైలంగౌడ్, రవితేజగౌడ్ తదితరులు పాల్గొన్నారు.
- **యాచారం :** మండలంలోని పేదలకు సంక్షేమ పథకాలందించి ఆదుకోవాలని ఎంపీపీ సుకన్య, వైస్ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డిలు ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, తహసీల్దార్ టి.అయ్యప్పలను కోరారు ఈమేరకు వారిని సత్కరించారు. నల్లవెల్లి ఎంపీటీసీ లక్ష్మీపతిగౌడ్ తదితరులున్నారు.
- **చౌదరిగూడ :** జిల్లేడ్ చౌదరిగూడ మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన జగదీశ్వర్‌ను బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హాఫీజ్, డైరెక్టర్ జబ్బార్‌ల అధ్వర్యంలో నాయకులు తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటస్వామి, వెంకటేష్, చెన్నయ్య, కుమార్, ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మైనర్ విద్యార్థినిపై లెక్చరర్ లైంగికదాడి

- ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి అఘాయిత్యం
- నిందితుడి అరెస్టు.. పోక్సో కేసు నమోదు

శంషాబాద్, ఫిబ్రవరి 16 : విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఓ లెక్చరర్ తన వద్ద చదువుకుంటున్న ఓ మైనర్ విద్యార్థినికి మాయమాటలు చెప్పి ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధిత బాలిక జరిగిన విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. విచారించిన పోలీసులు నిందితుడిని శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. నిజామాబాద్ ప్రాంతానికి చెందిన సూర్యదీప్ అనే వ్యక్తి శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. అదే కళాశాలలో చదివే ఓ విద్యార్థినిని ప్రేమపేరుతో మాయమాటలు చెప్పి హైదరాబాద్‌లోని ఓ హోటల్‌కు తీసుకెళ్లాడు. ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు.

రైలుకింద పడి యువకుడి ఆత్మహత్య

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 16: భార్యాభర్తల మధ్య తలెత్తిన మనస్పర్థల కారణంగా రైలుకింద పడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన షాద్‌నగర్ రైల్వేస్టేషన్ పరిధి బూర్గుల శివారులో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లేష్ కథనం ప్రకారం.. ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుగడ్డ తండాకు చెందిన మూడావత్ నరేష్(22) భార్యతో మనస్పర్థలు రావడంతో శుక్రవారం ఉదయం 10.00గంటలకు బూర్గుల రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలపై తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రమాదంలో తల మొండెం నుంచి తెగిపడింది. స్టేషన్ మాస్టర్ విజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మతిస్థిమితం సరిగాలేని ఓ మహిళ..

షాద్‌నగర్ రైల్వేస్టేషన్ పరిధిలోని చిలకమర్రి రైల్వేగేట్ సమీపంలో రైలుకింద పడి ఓ మహిళ మృతిచెందినట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేష్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం చిల్కమర్రి గ్రామానికి చెందిన పోతురాజు లలిత(52) మతిస్థిమితం సరిగా లేకపోవడంతో గురువారం రాత్రి రైలుకింద పడటంతో మృతి చెందినట్లు తెలిపారు. స్టేషన్ మాస్టర్ విజయ్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మల్లేష్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



కురుమన్న(ఫైల్)

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 16 : వ్యక్తి అదృశ్యమైన ఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లాకు చెందిన మంద కురుమన్న భార్య రాణితో కలిసి కొన్ని రోజుల క్రితం బతుకుదెరువు కోసం మండల పరిధిలోని నర్కూడకు వలస వచ్చారు. ఈ నెల 15న సుల్తాన్‌పల్లిలో ఎల్లయ్య మేస్త్రీ వద్ద పనికి వెళ్లాడు. అదేరోజు మేస్త్రీ వద్ద రూ.400 తీసుకొని ఆటో ఎక్కి శంషాబాద్ వెళ్లాడు. ఆ తర్వాత అతడు ఇంటికి వెళ్లలేదు. దాంతో బంధువులు, స్నేహితుల వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌లో అతడి భార్య ఫిర్యాదు చేసింది. కురుమన్న ఎరుపు రంగు షర్టు, నల్లని ప్యాంట్ ధరించి ఉన్నాడని, ఎత్తు 5 అంగులాలు ఉంటాడని, మాటలు సరిగా రావని తెలిపారు. ఆచూకీ తెలిస్తే శంషాబాద్ పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

బైకు దొంగ అరెస్టు.. మూడు వాహనాలు స్వాధీనం

ఆదిభట్ల, ఫిబ్రవరి 16 : బైకు దొంగతనాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని ఆదిభట్ల పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అతడి నుంచి గతంలో దొంగిలించిన మూడు బైకులను స్వాధీనం చేసుకున్నారు. సీఐ రాఘవేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని బాపులపాడు మండలం విజయవాడకు చెందిన షేక్ అబ్దుల్‌వలీ అలియాస్ బాజీ బాషా ఆదిభట్ల మున్సిపాలిటీ బొంగ్లూరులో తల్లి, సోదరుడితో కలిసి ఉంటూ పెయింటర్‌గా పనిచేస్తుండేవాడు. కొన్ని రోజులుగా బైకుల చోరీలకు పాల్పడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు నిఘా పెట్టి శుక్రవారం అరెస్టుచేసినట్లు సీఐ రాఘవేందర్ రెడ్డి తెలిపారు. గతంలో చోరీ చేసిన మూడు బైకులను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

నూతన ఆవిష్కరణలు భవిష్యత్తు తరాలకు ఉపయోగపడాలి



ప్రొఫెసర్ హరినాథ్‌ను సత్కరిస్తున్న యూనివర్సిటీ బృందం

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి 16: విద్యార్థులు చేపట్టే నూతన ఆవిష్కరణలు భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా ఉండాలని, అవి దేశ ఉన్నతిలో భాగం కావాలని వరంగల్ నిట్ ప్రొఫెసర్ డి.హరినాథ్ సూచించారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామపరిధిలోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో ‘రీసెంట్ ఇన్ అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్’ అనే అంశంపై యూనివర్సిటీ విభాగంలోని ఫిజిక్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. చీఫ్‌అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్ సాత్వికరెడ్డి, వరంగల్ నిట్ ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ రాజేష్, కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఆంజనేయులు, ప్రొ.రాజు, అధ్యాపకులు, శాఖాధిపతులు తదితరులు ఉన్నారు.

జాతీయ స్థాయి శిక్షణ శిబిరాలతో ఎంతో మేలు

వివిధ విభాగాల్లో పరిశోధనలు చేసే విద్యార్థులు జాతీయ స్థాయిలో నిర్వహించే శిక్షణ శిబిరాలను సందర్శించడం ద్వారా ఎంతో మేలు జరుగుతుందని భారత వైద్య పరిశోధన మండలి-జాతీయ పౌష్టికాహార సంస్థ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శశిభూషణ్ తెలిపారు. నగరంలోని తార్నాకలో గల భారత పరిశోధన మండలి-జాతీయ పౌష్టికాహార సంస్థను మండల పరిధిలోని హిమాయత్ నగర్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీకి చెందిన ఫార్మసీ, డీ-ఫార్మసీ విద్యనభ్యసిస్తున్న దాదాపు 145 మంది విద్యార్థులు ప్రొఫెసర్ జి.కుమారస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం సందర్శించారు. అక్కడి మ్యూజియం, పరిశోధనలు, ప్రయోగశాలలను ఆసక్తిగా సందర్శించారు. పలు విషయాలను సంస్థలోని సిబ్బందిని అడిగి నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపక బృందంతో పాటు విద్యార్థులు తదితరులున్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కేశంపేట, ఫిబ్రవరి 16: సైబర్ నేరాల పట్ల యువత, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కేశంపేట ఎస్సై కుప్పగిరి లింగం సూచించారు. మండల పరిధిలోని కొత్తపేట జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు సైబర్ నేరాలపట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎవరైన ఫోన్ చేసి బ్యాంకుల నుంచి మాట్లాడుతున్నామని.. ఓటీపీ వస్తుందని మాకు చెప్పాలని అడిగితే చెప్పవద్దని సూచించారు. బ్యాంకు సిబ్బంది ఎప్పుడూ ఫోన్ చేసి వివరాలు అడగదని తెలిపారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఆర్ఎంపీలతో సమావేశం నిర్వహించారు. ప్రాథమిక చికిత్సలు మాత్రమే అందించాలని వారికి సూచించారు. ప్రిన్సిపాల్ సుధారాణి, అధ్యాపకులు తదితరులున్నారు.

జన్వాడలో 21 వరకు 144 సెక్షన్

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 16 : జన్వాడ గ్రామంలో చోటుచేసుకున్న రోడ్డు వివాదం ఇరు వర్గాల ఘర్షణకు దారితీసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో ఈ నెల 21 వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని సైబరాబాద్ సీపీ ఆదేశాలు జారీ చేసింది. శుక్రవారం పోలీసులు బందోబస్తు నిర్వహించారు. హిందువులను అక్రమంగా అరెస్ట్ చేశారనే ఉద్దేశ్యంతో వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ సభ్యులు మోకిల పోలీస్ స్టేషన్‌ను ముట్టడిస్తామనే సమాచారంతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జన్వాడకు వెళ్లే 4రహదారులను స్పెషల్ ఫోర్స్‌తో వాహనాలను క్షుణంగా తనిఖీ చేసి గ్రామానికి పంపిస్తున్నారు. నార్సింగ్ ఏసీపీ రమణగౌడ్ ఆధ్వర్యంలో బందోబస్త్ నిర్వహించారు.

వాహనదారులు ధ్రువపత్రాలు కలిగి ఉండాలి

యాచారం, ఫిబ్రవరి 16 : వాహనదారులు ధ్రువపత్రాలు కలిగి ఉండాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు సూచించారు. ఈమేరకు శుక్రవారం సాయంత్రం మేడిపల్లిలో ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేశారు. డ్రైవింగ్ పత్రాలు లేని వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. రూ.50వేలకు మించి డబ్బు ఉంటే తగిన ఆధారాలు చూపాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.